క్లుప్తంగా

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం



పింఛన్ అందిస్తున్న ఎంపీపీ గాంధీ తదితరులు

శనగపాడు(పెనుగంచిప్రోలు): సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. మండలంలోని శనగపాడులో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న కీసర భాస్కరరావుకు మంజూరైన రూ.10 వేల పింఛన్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో పింఛన్ల పండగ నిరంతరం కొనసాగుతోందన్నారు. మండలంలో 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సైదులు, సొసైటీ అధ్యక్షులు పారుపల్లి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కీసర లోకేష్, గ్రామ కార్యదర్శి సీతారామరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

8న సర్వసభ్య సమావేశం

వత్సవాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల ఎనిమిదో తేదీ జరుగుతుందని ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను హాజరవుతారని, మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వరనగర్‌లో సాయి అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తుల ప్రతిష్ఠా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం పలురకాల హోమాలు చేశారు. ప్రతిష్ఠించబోయే దేవతామూర్తుల విగ్రహాలకు పుష్పాధివాసం నిర్వహించారు.

- అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో గణపతి ఆలయం వద్ద జీవ ధ్వజస్తంభం, నవ నాగులు, ఐదడుగుల శనైశ్చర విగ్రహం, అభయాంజనేయ స్వామి విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం జరగనుంది.

కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



ర్యాలీలో వైద్యాధికారి నాగరాణి, విద్యార్థులు, వైద్య సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో స్థానిక లెప్రా సొసైటీ ఆధ్వర్యాన విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేశారు. ప్రభుత్వాస్పత్రిలోని పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ నాగరాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిపై అందరు అవగాహన కలిగి ఉండాలన్నారు. లెప్రా సొసైటీ ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు ఉంటే కుష్ఠు వ్యాధిగా అనుమానించాలని తెలిపారు. విద్యార్థులు ప్ల కార్డులతో కుష్ఠుపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వాస్పత్రి వైద్య ఆరోగ్య సిబ్బంది, విశ్వభారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు, శ్రేయస్సు సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు మందుల కవర్లు అందజేత

వీరులపాడు: మండలంలోని రెండు పీహెచ్‌సీలకు మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యాన సంస్థ అధ్యక్షుడు త్రినాధ్‌రెడ్డి శనివారం మందులు పెట్టుకునే కవర్లను అందజేశారు. మందులు పెట్టుకుని వెళ్లేందుకు రోగులు ఇబ్బందులు పడుతుండటంతో వాటిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి నందినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న జూపూడి నిమ్రా వైద్యకళాశాల హౌస్ సర్జన్‌లు

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక నిమ్రా వైద్యశాలలో రోగులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యశాల హౌస్ సర్జన్‌లు క్యాన్సర్ వ్యాధి నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై స్కిట్, ప్లకార్డుల ద్వారా రోగులకు అవగాహన కల్పించారు. వైద్యశాల సూపరింటెండెంట్ శ్యామలాదేవి, ప్రొఫెసర్ వినయ్ బాబు, రీసెర్చ్ కోఆర్డినేటర్ మహబూబ్ వలి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సత్తార్‌ఖాన్ క్యాన్సర్ వ్యాధిపై సందేశం ఇచ్చారు. వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ ఇళ్లు

కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు



కంచికచర్లలో లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కంచికచర్ల: అర్హులకు స్థలంతో పాటు ఇళ్లు కూడా కేటాయిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. కంచికచర్లలో 2004 సంవత్సరంలో లబ్ధిదారులకు ఇచ్చిన కాలనీ స్థలాలను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావుతో కలసి శనివారం పరిశీలించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇరవై సంవత్సరాల క్రితం కంచికచర్ల సమీపంలో నేషనల్‌హైవే పక్కన 565-1బీ, 566-2ఏ 5-70- ఎ లో 715మందికి ఇళ్ల స్థలంలో కేటాయించారని తెలిపారు. ఒక్కో లబ్ధిదారుడికి 84 గజాల స్థలాన్ని కేటాయించారన్నారు. నాటి నుంచి కాలనీలో మౌలిక సదుపాయాలు లేక పోవటంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేక పోయారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ జగనన్న కాలనీగా మార్చివేసి నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేలా మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. గతంలో ఇందిరమ్మ గృహం ద్వారా కొంతమంది ఇల్లు కట్టుకున్నారని, అవి అసంపూర్తిగా ఉన్నాయని ప్రస్తుతం వారి ఐడీని రద్దు చేసి తిరిగి జగనన్న గృహం మంజూరు చేస్తారని చెప్పారు. 715 మందిలో ఎక్కువ మంది పట్టాదారులుండగా మరికొంతమంది స్థలాలు అమ్ముకున్నారని తెలిసిందన్నారు. వారిలో పేదవారిని గుర్తించి అర్హత ఉంటే మాత్రం స్టేట్ లెవెల్ కమిటీలో పెట్టడానికి ప్రపోజల్స్ పంపిస్తామని వివరించారు. లబ్ధిదారులకు లే అవుట్‌కు సంబంధించిన బీ ఫారం రద్దు చేయాలా లేదా వాటిని కొనసాగించాలా అనేది త్వరలో కంచికచర్ల లోగానీ, నందిగామలోగానీ రివ్యూ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఆధార్, బియ్యం కార్డు, బ్యాంకు ఖాతా నెంబర్‌లను సేకరిస్తామన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం: ఎమ్మెల్యే

ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కంచికచర్లలో నిర్వహించామని కొంతమంది తమకు 20 ఏళ్ల క్రితం ఇళ్ల స్థలం ఇచ్చారుగానీ మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఇళ్లు కట్టుకోలేకపోయారనే విషయం తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. వారి ఆవేదనను అర్థం చేసుకుని కలెక్టర్, రెవెన్యూ, గృహనిర్మాణశాఖ అధికారులను పిలిచి లబ్ధిదారులతో కాలనీలోని సమస్యలను వివరించామన్నారు. త్వరలో జగనన్న కాలనీగా మార్చివేసి విద్యుత్, అంతర్గత రోడ్లు, నీటి సౌకర్యం, తదితర మౌలిక సదుపాయాలు కల్పించి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మండలంలోని కీసర జగనన్న కాలనీ లే అవుట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు, తహసీల్దార్ వి.రాజకుమారి, ఎంపీడీఓ బాలశంకరరావు, హౌసింగ్ ఏఈ ఎ.నరసింహారావు, విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీ సాయిప్రియ, సర్పంచి వేల్పుల సునీత, వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, మాడుగుల మధుబాబు, వేమా సురేష్‌బాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

నందిగామ టౌన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలో చందాపురంలోని జగనన్న కాలనీని శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు, జగన్‌మోహనరావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పిస్తారన్నారు. లేఅవుట్‌లో అన్ని అడ్డంకులను పరిష్కరించి అర్హులకు ఇళ్ల స్థలాలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. దీనిపై ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, కలెక్టర్ ఢిల్లీరావు చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ నరసింహారావు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఆధ్యాత్మిక విషయంలో శాస్త్రీయత

- నూతన రథానికి పూజలు చేసిన విద్యారణ్యభారతీస్వామి
- రామలింగేశ్వరుడి పూజల్లో కలెక్టర్, ఎమ్మెల్యే



రథ పూజల్లో కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: హిందూ సనాతన ధర్మంలో ప్రతి ఆధ్యాత్మిక విషయంలో శాస్త్రీయత చోటు చేసుకుందని హంపీ విరూపాక్షి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామీ పేర్కొన్నారు. స్థానిక రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో పాల్గొని శనివారం స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన రథానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన అనుంగభాషణం చేస్తూ దేవుడిపై విశ్వాసం ఉంచడం గొప్ప విషయమన్నారు. విశ్వాసం లేకుండా దైవ పూజ చేసినా సత్ఫలితాన్ని ఇవ్వదని చెప్పారు. అనాదిగా పెద్దలు ఏర్పాటు చేసిన ఉపవాసంలో ఎంతో శాస్త్రీయత చోటు చేసుకుందన్నారు. ఎంతో పురాతనమైన, శక్తివంతమైన ఈ ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకోవటం మహద్భాగ్యమన్నారు. కార్యక్రమంలో ఈవో దూళిపాళ్ల సుబ్రహ్మణ్యం, వ్యవస్థాపక ధర్మకర్త వాసిరెడ్డి మురళీ రాఘవ కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కోవెలమూడి వెంకట నారాయణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి పూజలు చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే..

పట్టణంలోని శుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ స్వామి వారి రథోత్సవం నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. శిథిలమైన రథ స్థానంలో కొత్త రథాన్ని సీజీఎఫ్ నిధులతో చేయించామన్నారు. గత కల్యాణోత్సవంలో భక్తులకు ఇచ్చిన హామీ మేరకు సుందరమైన నూతన రథాన్ని తయారు చేయించి ఉత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. దీనికి ఆలయ ధర్మకర్త మురళీ రాఘవ కుమార్, ఈవో సుబ్రహ్మణ్యం పూర్తి సహకారం అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ నరసింహారావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు మహ్మద్ మస్తాన్, నల్లమల్లి మురళి, నాయకులు గుడివాడ సాంబశివరావు, సముద్రాల మధుబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాచూరి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కంచికచర్ల: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నందిగామ రూరల్ సీఐ ఐవీ నాగేంద్ర కుమార్ చెప్పారు. కంచికచర్లలో మిక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు శనివారం మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువశక్తి దేశానికి ఉపయోగపడాలన్నారు. యువత డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించకూడదని హితవు పలికారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, మత్తు పదార్థాలకు అలవాటు పడి నిండు జీవితాలను బలిచేసుకోవద్దని హితవు పలికారు. ఇప్పటికే డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు.

కళాశాలలకు వెళ్లే రోడ్లలో ఫ్లెక్సీ

మండలంలోని పేరకలపాడు క్రాస్‌రోడ్డు సమీపంలోని మిక్ ఇంజినీరింగ్ కళాశాల, పరిటాల అమ్రిత సాయి, ఎంవీఆర్ కళాశాలల సమీపంలో జాతీయ రహదారి పక్కన డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేయాలని సీఐ నాగేంద్రకుమార్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. డ్రగ్స్ విక్రయించినా, కొనుగోలు చేసినా, డ్రగ్స్, మత్తు పదార్థాలు వాడినా టోల్‌ఫ్రీ నెంబర్ 14500ల నెంబర్‌కు ఫోన్ చేయాలని సీఐ అన్నారు. అనంతరం పట్టణంలో నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి పెట్రోలు బంక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్, ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు ఎస్ఐలు పీవీఎస్ సుబ్రహ్మణ్యం, సోమేశ్వరరావు, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

చదువు, క్రీడలతో ఉత్తమ భవిష్యత్



అండర్-17 బాలికల టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా నిలిచిన కృష్ణా జిల్లా జట్టుతో ప్రభుత్వ విప్ ఉదయభాను

ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: చదువు, క్రీడలతోనే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు ఏర్పడుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గత నెల 30 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు స్థానిక ఉక్కు కళావేదికలో జరిగిన 66 వ ఏపీ స్టేట్ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్స్-2023 పోటీల్లో పవర్ లిఫ్టింగ్‌లో గెలుపొందిన విజేతకు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ఉదయభాను బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12 జిల్లాల నుంచి వచ్చిన సుమారు 500 మంది వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు చక్కని ఏర్పాట్లు చేసిన ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండ్ జిల్లా పరిషత్ హైస్కూల్, చిల్లకల్లు వారిని అభినందించారు. ఇంత చక్కగా ఆర్గనైజ్ చేసిన వారికి రామ్‌కో సిమెంట్స్ వారితో మాట్లాడి రూ 1.25 లక్షల చెక్కును అందజేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఆర్.సీజర్ రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంటా వెంకటేశ్వర్లు, స్కూల్ హెచ్ఎం వేముల వెంకటేశ్వరరావు విజేతల వివరాలను తెలిపారు. అనంతరం ఆర్గనైజింగ్ కమిటీ, అధికారులు, ఉపాధ్యాయులు కలిసి ఎమ్మెల్యే ఉదయభానును సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మండల అధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాస్, నాయకులు ఫిరోజ్‌ఖాన్, పూసాల పుల్లారావు, టోర్నమెంట్ అబ్జర్వర్‌లు నాగశిరీష, ఎన్.శ్రీదేవి, పీడీలు గురునాథం, సరోజ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కన్వీనర్ ఎం. శ్రీనివాసరావు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ దినేష్, ట్రెజరర్ సీహెచ్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో మండలంలోని చిల్లకల్లులో ఆల్ సెయింట్స్ పాఠశాల విద్యార్థిని జి.హారిక తృతీయ స్థానంలో నిలిచింది. అండర్-17 బాలికల విభాగంలో 47 కేజీల కేటగిరిలో పాల్గొని తృతీయ స్థానం పొందింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నుంచి మెడల్ అందుకుంది. ఈ సందర్భంగా శనివారం జగ్గయ్యపేట పట్టణంలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ ఫాదర్ జయప్రసాద్, ఉపాధ్యాయులు హారికను అభినందించారు.

8న వత్సవాయమ్మ కానుకల లెక్కింపు

వత్సవాయి: గ్రామంలోని శ్రీరామ జగపతి దేవసమేత శ్రీ వత్సవాయమ్మ ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈ నెల ఎనిమిదో తేదీ నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సీహెచ్ హరి దుర్గానాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు కానుకల లెక్కింపుతో పాటు అమ్మవారికి సమర్పించిన చీరెలు, జాకెట్ ముక్కలకు బహిరంగ వేలం జరుగుతుందని పేర్కొన్నారు.

పెనుగంచిప్రోలుకు తిరుపతమ్మ దీక్షాధారులు



కాలినడకన తిరుపతమ్మ దీక్షాధారులు



స్థల శుద్ధి ప్రాంతంలో పూర్ణాహుతిలో ఆలయ ఈఓ, చైర్మన్, పాలకవర్గ సభ్యులు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ దీక్ష విరమించి తిరుముడి సమర్పణకు కాలినడకన పెనుగంచిప్రోలుకు చేరుకుంటున్నారు దీక్షాధారులు. శనివారం ఉదయం నుంచే స్వాములు వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన, వాహనాల్లో గ్రామానికి వస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల అనంతరం తిరుముడి సమర్పించి, హోమద్రవ్యాలు, నేతి కొబ్బరి చిప్పలు హోమగుండంలో వేస్తారు.

స్వాములకు గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది కూడా ఆలయం నిర్వాహకులు ప్రత్యేకంగా మునేరులో జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. దీక్షా స్వాముల కోసం మునేరు అవతల అమ్మవారి ఆలయానికి చెందిన ఆడిటోరియం స్థలంలో ఉచిత భోజన ఏర్పాట్లకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. అన్నదానానికి ఎంతోమంది దాతలు సహాయ సహకారాలు అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ముగిసిన స్థల శుద్ధి పూజలు

ఆదివారం రాత్రి జరిగే తిరుపతమ్మ కల్యాణ మహోత్సవానికి కల్యాణ వేదిక స్థలంలో మూడు రోజులుగా జరుగుతున్న స్థల శుద్ధి పూజలు శనివారం ముగిశాయి. మూడు రోజులుగా గోపూజ, ప్రత్యేక పూజలు, హోమాల అనంతరం పూర్ణాహుతితో ముగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి

వీరులపాడు: గ్రామంలో వైఎస్సార్ జగనన్న భూ హక్కు భూ రక్ష పథకాన్ని శనివారం తహసీల్దార్ ఆశయ్య నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న భూ హక్కు భూ రక్ష పథకం ద్వారా చేపడుతున్న భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

నేత్రపర్వం రామలింగేశ్వరుడి రథోత్సవం



రథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

నందిగామ: స్థానిక మెయిన్ బజారులోని శ్రీ శుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి రథోత్సవం శనివారం రాత్రి నేత్ర పర్వంగా సాగింది. మాఘ పూర్ణమి సందర్భంగా స్వామి వారి కల్యాణం అనంతరం ఏటా రథం తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. రథయాత్రను ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ టెంకాయ కొట్టి ప్రారంభించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కొత్తగా తయారు చేయించిన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మేళతాళాలు, కోలాటం నృత్యాల నడుమ స్వామివారి రథయాత్ర కొనసాగింది. భక్తులు హరహర మహాదేవ అంటూ రథాన్ని లాగుతూ తరించి పోయారు. ఆలయం నుంచి మెయిన్ బజారు మీదుగా చందర్లపాడు బస్టాండ్ వరకు ఈ రథోత్సవ కార్యక్రమం జరిగింది. రథయాత్ర ఆలస్యంగా ప్రారంభం కావడంతో అర్ధరాత్రి వరకు కొనసాగింది.

ఉపాధి సిబ్బంది అలసత్వం వహిస్తే సహించం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించబోమని డ్వామా జిల్లా పీడీ, జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి జుజ్జవరపు సునీత పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 2020-22 వరకు పనులు జరిగాయన్నారు. 2020-21లో రూ. ఐదు లక్షల పనులకు రూ. 10.50 కోట్లు, మెటీరియల్ ద్వారా రూ. 50 లక్షలు, 2021-22లో 4.90 లక్షల పని దినాలకు రూ. 11.40 కోట్లు, మెటీరియల్ ద్వారా రూ. రెండు కోట్ల పనులు జరిగాయన్నారు. అయితే మస్టర్‌ల విధానంలో మేట్‌లు నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో మార్చి 31కి 77 లక్షల పని దినాలు కల్పించామని, ఇప్పటి వరకు 60.4 శాతం పనులు చేశామన్నారరు. మిగిలిన పనులు కూడా మార్చి 31 నాటికి పూర్తి చేసి ఏప్రిల్ ఒకటి నుంచి కూలీలకు కొత్త పనులు కల్పిస్తామన్నారు. వత్సవాయి, నందిగామ మండలాల్లోని సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పనులు కూడా పర్యవేక్షించడం లేదన్నారు. కార్యక్రమంలో ఏపీడీ మరియకుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి ఉషశ్రీ, ఎంపీడీవో జయచంద్ర, ఏపీవో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతమ్మ కల్యాణోత్సవానికి విస్తృత బందోబస్తు



వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ, పక్కన డీఎస్పీ, సీఐ, ఆలయ చైర్మన్, ఈఓ, తదితరులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీసీపీ మేరీ ప్రశాంతి తెలిపారు. శనివారం ఆమె ఆలయం వద్ద కల్యాణ వేదిక స్థలాన్ని పరిశీలించి ఆలయ సిబ్బందికి, పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ నాగేశ్వరరెడ్డి, జగ్గయ్యపేట సీఐ నాగమురళి, ఎస్ఐ హరిప్రసాద్, ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయంలో చోరీ

- ధ్వజస్తంభ లోహపు తొడుగు అపహరణ



రంపంతో కోసి బయట పడేసిన ధ్వజ స్తంభం

తాటిగుమ్మి(వీరులపాడు): ధ్వజ స్తంభాన్ని రంపంతో కోసి దాని చుట్టూ ఉన్న లోహపు తొడుగును అపహరించిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని తాటిగుమ్మి గ్రామంలో కృష్ణానది ఒడ్డున చెన్నకేశవ స్వామి పురాతన ఆలయం ఉంది. గత రాత్రి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం ముందున్న ధ్వజస్తంభాన్ని రంపంతో కోసి చుట్టూ ఉన్న లోహపు తొడుగును అపహరించారు. దీనివిలువ సుమారు రూ.లక్ష ఉంటుందని అంచనా. ఎంతో చరిత్ర ఉన్న 50 ఏళ్ల నాటి అతి పురాతన ఆలయంలో ధ్వజ స్తంభాన్ని కోసి కింద పడేయటంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. చోరీకి పాల్పడిన వారు సర్జికల్ గ్లౌజ్‌లను అక్కడే వదిలి వెళ్లారు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

క్రమశిక్షణతోనే ఉత్తమ భవిత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్రమశిక్షణతోనే ఉత్తమమైన భవిష్యత్‌ను సొంతం చేసుకుంటారని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య పేర్కొన్నారు. మద్ది సుబ్బారావు హైస్కూల్ వార్షికోత్సవాన్ని కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ సుమారు 120 సంవత్సరాల చరిత్ర కలిగిన హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో ఎల్‌కేజీ నుంచి ఇంజినీరింగ్, పీజీ వరకూ పలు కోర్సులను అందిస్తున్నామన్నారు. అనంతరం చిన్నారులు నృత్య ప్రదర్శనతో జరిగింది. పాఠశాల అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చిట్టూరి అమరసుధీర్, ప్రిన్సిపాల్ శ్యామల పాల్గొన్నారు.